నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 కరీంనగర్, సోమవారం 26 ఫిబ్రవరి 2024 JAGTIAL

## ఉచిత కంటి ఆపరేషన్లు చేసిన ఎమ్మెల్యే


కండ్లను పరీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల, ఫిబ్రవరి 25 : జిల్లా కేంద్రంలోని పావని కంటి దవాఖాన, ఆపి, రోటరీ క్లబ్ జగిత్యాల ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గ, పరిసర ప్రాంతాలకు చెందిన నిరుపేదలకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఉచిత కంటి ఆపరేషన్లు చేశారు. సుమారు 19 మందికి కంటి శస్త్ర చికిత్సలు చేసి, ఉచిత మందులు, కండ్ల అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్, ధరూర్ మాజీ సర్పంచ్ ప్రభాకర్, రాయికల్ మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ బర్కం మల్లేశ్, పట్టణ యూత్ ఉపాధ్యక్షుడు ఏనుగుల రాజు, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

## 29 వరకు రేషన్‌కార్డుల ఈ- కేవైసీ గడువు


ఈ-కేవైసీ నమోదు చేస్తున్న డీలర్ అంజయ్య

సిరిసిల్ల, ఫిబ్రవరి 25: రేషన్‌కార్డుల ఈ-కేవైసీ గడువును ఈ నెల 29 వరకు పొడిగించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా పౌరసరాఫరాల అధికారి జితేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. పారదర్శకంగా రేషన్ సరుకుల పంపిణీ కోసం అప్ప టి ప్రభుత్వం ఈ కేవైసీ(రేషన్ కార్డుకు ఆధార్ అనుసంధానం) ప్రక్రియను చేపట్టింది. ఇందుకు జనవరి 31 వరకు గడువు విధించింది. రేషన్ కార్డుల్లోని లబ్ధిదారులందరూ రేషన్ షాపులకు వెళ్లి ఈ పోస్ యంత్రం ద్వారా వేలిముద్రలు నమోదు చేయాల్సి ఉంటుంది. మరణించిన వారు, పెండ్లి చేసుకున్నవారు, ఉద్యోగాలు పొందిన వారి పేర్లు రేషన్‌కార్డుల్లోంచి తొలగించలేదు. దీంతో బియ్యం కోటాను సవరించలేదు. ప్రతినెలా బియ్యం మిగిలిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈకేవైసీ ప్రక్రియను చేపట్టింది. జిల్లాలో ఇప్పటికే 80 శాతం నమోదు పూర్తయిందని అధికారులు తెలిపారు. మొత్తం 343 రేషన్ దుకాణాలు, 1.73 లక్షల రేషన్ కార్డులు, సుమారు 5 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో సుమారు 4 లక్షల మంది ఈ కేవైసీ చేయించుకున్నారు.

# ఆగని ఇసుక అక్రమ దందా



### గడువు ముగిసినా పెద్దపల్లి జిల్లాలో కొనసాగుతున్న రవాణా

- ఇసుక మేటల మాటున సాగుతున్న వ్యవహారం
- గత డిసెంబర్ నాటికే ముగిసిన గడువు
- అయినా యథేచ్ఛగా సాగుతున్న వ్యాపారం
- సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా మూడు రోజులు బంద్
- తాజాగా, మళ్లీ మొదలు పెట్టేందుకు కసరత్తు?
- విషయం తెలిసినా పట్టించుకోని అధికారులు

**పెద్దపల్లి జిల్లాలో ఇసుక అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది. గడువు ముగిసినా ఈ వ్యవహారం మాత్రం ఆగడం లేదు. ముఖ్యంగా రైతుల పొలాల్లో ఇసుక మేటల పేరుతో దందా జోరుగా నడుస్తోంది. నిజానికి గత డిసెంబర్ నాటికే పొలాల్లోని ఇసుక దిబ్బ లు తీసి విక్రయించడానికి మాత్రమే అవకాశం ఉన్నా.. నేటికీ కొనసాగుతూనే ఉన్నది. సమ్మక్క జాతర సందర్భంగా గడిచిన మూడు రోజులు ఈ దందాను తాత్కాలికంగా ఆపేసినా.. మళ్లీ ఒకటి రెండు రోజుల్లో ప్రారంభించేందుకు అక్రమార్కులు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. పొలాల్లోని దిబ్బ ల ఇసుకను తరలించడమే ప్రస్తుత నిబంధనలకు విరుద్ధం కాగా, దీని మాటున మానేరు ఇసుకను కొందరు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ వ్యవహారానికి అడ్డుకట్టవేయాల్సిన అధికారయంత్రాగం.. చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడం అక్రమార్కులకు కలసి వస్తుండగా.. కొందరు అధికార పార్టీ నాయకులు ఇందులో కీలక పాత్రదారులుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.**

కరీంనగర్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పెద్దపల్లి జిల్లా ఇసుక అక్రమాలకు నిలయంగా మారింది. దోచుకున్న వారికి దోచుకున్నంత అన్న చందంగా సాగుతోంది. అధికారికంగా తవ్వకానికి గడువు ముగిసినా.. నిత్యం పెద్ద మొత్తంలో లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. ఈ జిల్లాలో టీఎస్ఎండీసీ, భూగర్భగనుల శాఖల ఆధ్వర్యంలో పలు చోట్ల ఇసుక క్వారీలు నడుస్తుండగా, టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో పొత్కపల్లి-2, గుండ్లపల్లి-2, ముత్తారం, అడవిసోమన్‌పల్లి, ఓడేడ్, శ్రీరాంపూర్, ఖమ్మంపల్లి, అడవి శ్రీరాంపూర్, జిల్లెల్లపల్లి ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. నిజానికి ఈ క్వారీల నుంచి ఇసుకను ఎత్తేందుకు అనుమతి 2023 డిసెంబర్ 31తో ముగిసింది. ఈ క్వారీల నుంచి అధికారులు చెపుతున్న లెక్క ప్రకారం కోటి 32 లక్షల క్యూబిక్ మీటర్లు ఇసుక తీయడానికి ఆస్కారం ఉండగా.. ఇప్పటి వరకు 70,72,840.84 క్యూబిక్ మీటర్లు తీసినట్లు చెబుతున్నారు. అయితే, సదరు క్వారీల నుంచి తీసిన ఇసుకను స్టాక్ పాయింట్లలో పెట్టి.. ప్రస్తుతం అధికారికంగా రవాణా చేస్తున్నట్లుగా ఈ క్వారీల నిర్వాహకులు చెబుతున్నారు. దీనిని లోతుగా చూస్తే.. ఇక్కడ జరుగుతున్న తంతు మరో రకంగా ఉంది. అయితే, ఇదిలా ఉండగా.. రైతుల పొలాల్లో ఇసుక మేటల మాటున కొందరు అక్రమాలకు తెరలేపారు. గతంలో మానేరు పొంగినప్పుడు.. ముత్తారం మండలం ఓడేడ్ గ్రామ పరిధిలోని రైతుల పొలాల్లో ఇసుక దిబ్బలు ఏర్పడ్డాయి. వీటిని తొలగించుకునేందుకు సదరు రైతులు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలి. ఆ మేరకు ఐదు శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. రెవెన్యూ, నీటిపారుదల, భూగర్భజలశాఖ, టీఎస్ఎండీసీ, భూగర్భగనుల శాఖాధికారులు పరిశీలించి.. సదరు రైతు పొలాల్లో ఎంత మేరకు ఇసుక దిబ్బలున్నాయి. అందులో వెళ్లే ఇసుక ఎంత..? గుర్తించి అనుమతి ఇస్తారు. ఆ మేరకు సదరు రైతు దానిని తరలించుకునేదుకు ఆస్కారం ఉంటుంది. ఇలా ఇసుక దిబ్బలపేరుతో దాదాపు 39 నుంచి 45 మందిరైతులు దరఖాస్తు చేసుకోగా.. సదరు అధికారులు అనుమతులు ఇచ్చారు.

### మళ్లీ షురూ?

ఇసుక దిబ్బల పేరుతో ఇసుక తరలించే అవకాశం గతేడాది డిసెంబర్ 31 నాటికే ముగిసింది. ఆ తర్వాత ఎవరూ పొలాల నుంచి ఇసుకను తరలించడానికి ఆస్కారం లేదని మైనింగ్ అధికారులే చెబుతున్నారు. కానీ, దీని మాటున భారీ అక్రమాలు జరుగుతున్నాయి. నిజానికి డిసెంబర్ నాటికే గడువు ముగిసినా.. నేటికీ పొలాల్లో మేటలు వేసిన ఇసుకను కొందరు కాంట్రాక్టర్లు అక్రమంగా పెద్ద మొత్తంలో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక మేటల తొలగింపు పేరుతో ఒక్క ఓడేడు గ్రామ పరిధిలోనుంచే రోజుకు సుమారు 20 నుంచి 40 లారీల వరకు అక్రమంగా తరలిస్తున్నారని తెలుస్తోంది. దీనికి కొంత మంది అధికార పార్టీ నాయకుల అండ ఉన్నది. ఇందులో భాగంగానే కొందరు నాయకులు ప్రత్యక్షంగా, మరి కొందరు పరోక్షంగా ఈ దందాలో భాగస్వాములవుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అంతే కాదు.. ఇందుకోసం మానేరులో కొంత మంది రోడ్డు వేసినట్లు ఆరోపణలున్నాయి. అక్కడితో ఆగకుండా ఇదే రోడ్డుపై కొందరు టోల్‌టాక్స్ పేరుతో వచ్చిపోయే వాహనాలకు అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. అయితే, అక్రమ వాహనాలు కాబట్టి.. అడిగినంత టోల్‌టాక్స్ చెల్లిస్తున్నారు. అలాగే, ఈ రోడ్డు ద్వారా జయశంకర్ భూపాలపల్లి జిల్లా గర్మిలపల్లి, తదితర గ్రామాలకు చెందిన వందలాది ట్రాక్టర్ల ద్వారా మానేరులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. రాత్రి పూట అక్రమంగా తరలించిన ఇసుకను వేర్వేరు చోట్ల డంప్ చేసి, అక్కడి నుంచి అక్రమార్కులు హైదరాబాద్‌కు చేరవేస్తున్నారు. ఇదో పెద్ద మాఫియాగా నడస్తుందన్న విమర్శలు వస్తున్నాయి. అలాగే, నిబంధనల ప్రకారం ఏయే కోణంలో చూసినా.. ప్రస్తుతం పొలాల్లో నుంచి ఇసుకను తరలించడానికి ఆస్కారమే లేదని అధికారులే చెబుతున్నారు. కానీ, ఓడెడ్ నుంచి మంథని మీదుగా ప్రధాన రహదారి వెంట పెద్దమొత్తంలో అక్రమంగా లారీలు వెళ్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ అక్రమ ఇసుక రవాణా గురించి.. ఈ నెల 21న ''మానేరు పొడవునా ఇసుక తోడేళ్లు'' శీర్షిక పేరిట 'నమస్తే తెలంగాణ' కథనం ప్రచురితం చేసిన విషయం తెలిసిందే. ఈ కథనం అధికారులతోపాటు అక్రమార్కుల్లోనూ వణుకు పుట్టించింది. జరుగుతున్న అక్రమ ఇసుక రవాణా గురించి కళ్లకు కట్టినట్లుగా వివరించడంతో అధికారయంత్రాగం అప్రమత్తమైంది. ఆ మేరకు సదరు రవాణాదారులను కొద్ది రోజుల పాటు నిలిపివేయమని మౌఖికంగా సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇదే సమయంలో సమ్మక్క జాతర రావడంతో గడిచిన మూడు నాలుగు రోజులుగా అక్రమ రవాణా నిలిపేశారని తెలుస్తోంది. మళ్లీ విషయం సద్దు మణగడంతో తిరిగి ఒకటి రెండురోజుల్లో మళ్లీ పాత పద్ధతిలోనే ఇసుక అక్రమ రవాణాకు సదరు అక్రమార్కులు పూనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. దీనిపై అధికారయంత్రాగం పటిష్టంగా పనిచేస్తే తప్ప.. అడ్డుకట్ట పడదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇది లాగే కొనసాగిస్తే.. రేపు ప్రభుత్వం కొత్తపాలసీ తీసుకొచ్చినా ప్రయోజనం ఉండకపోగా.. అక్రమ వ్యాపారానికి అడ్డూ అదుపూ లేకుండా పోయే ప్రమాదం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



## రామగుండం సీపీకి ఐజీగా ఉద్యోగోన్నతి


ఐజీ శ్రీనివాసులు

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 25: రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాసులకు ఐజీగా ఉద్యోగోన్నతి లభించింది. శనివారం రాత్రి ప్రభుత్వ సీఎస్ శాంతి కుమారి ఉత్వర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 2006 ఐపీఎస్ క్యాడర్ అధికారులు ఆరుగురికి ఐజీలుగా ఉద్యోగోన్నతి కల్పించగా అందులో శ్రీనివాసులు ఒకరు.


ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు

## రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు

రామగిరి, ఫిబ్రవరి 25: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరుగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ అండర్-14 క్రికెట్ పోటీలకు ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు బయల్దేరి వెళ్లిందని ఎస్‌జీఎఫ్‌టీఎస్ సెక్రెటరీ డాక్టర్ కే.రాంరెడ్డి, జిల్లా సెక్రెటరీ కొమురోజు శ్రీనివాస్ తెలిపారు. 67వ ఎస్‌జీఎఫ్‌టీఎస్ క్రికెట్ పోటీలు ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు జరుగనున్నాయి. కాగా, ఈ జట్టులో పెద్దపల్లి జిల్లా నుంచి పల్లె సాక్షితరావు (కెప్టెన్), ఎస్కే సాధిక్ (వైస్ కెప్టెన్), ఎండీ తాజొద్దీన్, ఆర్.చిరు వెంకట ప్రసాద్, కౌశిక్, అశ్రిత్, రక్షిత్, కరీంనగర్ నుంచి అఫిద్, సిద్ధార్థ, అచ్యుతనాథ్, ఆనంద్‌శాస్త్రి, సిరిసిల్ల నుంచి శివనాగ్, చరణ్‌తేజ్, నవదీప్, ఈశ్వర ప్రసాద్, మణికంఠ, జగిత్యాల నుంచి రాహుల్, ఉన్నత్ శౌర్య ప్రాతినిథ్యం వహిస్తున్నారు. కోచ్ అండ్ మేనేజర్‌గా సాయినాథ్ పటేల్ కూడా వీరి వెంట వెళ్లారు.


ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

## మల్కపేట కాలువల పనులు పూర్తిచేయాలి

- మూలవాగు చెక్‌డ్యామ్ పనులు చేపట్టాలి
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 25: మల్కపేట రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల పనులు పూర్తిచేసి సాధ్యమైనంత తొందరలో సాగునీరందించాలని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులకు సూచించారు. ఆదివారం వేములవాడలోని భీమేశ్వర గెస్ట్‌హౌస్ క్యాంపు ఆఫీసులో జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ శివకుమార్, ఈఈలు గంగం శ్రీనివాస్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డితో ప్రాజెక్టుల పనులపై సమీక్షించారు. సిరిసిల్ల జిల్లాలో ఎస్సారార్ నుంచి అప్పర్ మానేరు వరకు గల పెండింగ్ పనులు, మల్కపేట రిజర్వాయర్ కాల్వల నిర్మాణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సీఎం రేవంత్‌తో చర్చించి నిధుల విడుదలకు కృషి చేస్తానని చెప్పారు. ఈ పనులు పూర్తయితే 20 నుంచి 30 వేల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా నిమ్మపల్లి నుంచి వేములవాడ వరకు గల మూలవాగుపై నిర్మించిన చెక్‌డ్యాంల మరమ్మతును యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. మల్లారం ఆనకట్ట నుంచి గుడి చెరువుకు వచ్చే కట్టు కాలువ బుడగజంగాల కాలనీ వద్ద కాలువను నిర్మించాలని సూచించారు. సమావేశంలో ఈఈలు శ్రీనివాస్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, డీఈలు ప్రశాంత్‌కుమార్, శ్రీనివాస్, రవికుమార్, సత్యనారయణ, వినోద్‌కుమార్, క్రాంతికుమార్, సురేశ్, కిషోర్, ఏఈలు నవీన్‌కుమార్, శ్రీనివాస్, సాగర్, రాజు రమేశ్ ఉన్నారు.


పెద్దపల్లి మండలం సబ్బితం వద్ద జనం, పార్టీ శ్రేణులు రాక వెలవెలబోతున్న యాత్ర

## బీజేపీ సంకల్ప యాత్ర అట్టర్‌ప్లాప్

- కేంద్రమంత్రి వచ్చినా స్పందన కరువు
- జనం లేక, పార్టీ శ్రేణులు రాక వెలవెల
- పార్టీలో వర్గపోరే కారణమా..?

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 25 : పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బీజేపీ సంకల్ప యాత్ర అట్టర్‌ప్లాప్ అయింది. రాష్ట్రస్థాయి నాయకత్వానికి తోడు కేంద్రమంత్రి పరుషోత్తం రూపాలా వచ్చినా స్పందన కరువైంది. ఆదివారం పెద్దపల్లి జిల్లా సబ్బితం మీదుగా జిల్లా కేంద్రం దాకా సాగిన యాత్ర జనం లేక, సొంత పార్టీ శ్రేణులే హాజరు కాక వెలవెలబోయింది. పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ మధ్య వర్గపోరుతో పెద్దపల్లి సెగ్మెంట్ నేతలు ఎటూ తేల్చుకోలేకనే డుమ్మాకొట్టినట్లు ప్రచారం జరుగుతున్నది. అయితే, మంథని నియోజకవర్గానికి చెందిన నేత పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా ఉండడంతో కేవలం ఆ ప్రాంతానికి చెందిన యువకులు, నాయకులే పాల్గొని కాస్త పరువు కాపాడారని, లేదంటే యాత్రలో ప్రముఖులు తప్ప శ్రేణులు కనిపించేవారు కాదనే టాక్ కూడా వినిపించింది. ఇదిలా ఉండగా, విజయ సంకల్ప యాత్ర పెద్దపల్లి పట్టణంలోకి ప్రవేశించే క్రమంలో శాంతినగర్ రైల్వే ఫ్లైఓవర్ వద్ద వాహనాలను చాలాసేపు నిలిపివేయడం ప్రయాణికులను అసౌకర్యానికి గురిచేసింది. ఈ క్రమంలో పలువురు పోలీసులతో గొడవ పెట్టుకోవడం కనిపించింది.

# నీళ్లు లేక నెర్రెలు

- ఎస్సారెస్పీ చివరి ఆయకట్టులో ఎండుతున్న పంటలు
- పెద్దపల్లి జిల్లాలో డీ-83 కింద దెబ్బతింటున్న పొలాలు
- ప్రశ్నార్థకంగా పదివేలకుపైగా ఎకరాలు
- ఆందోళనలో మంథని, ముత్తారం మండలాల రైతులు
- పంటల రక్షణ కోసం పాట్లు

**మొన్నటి దాకా సాగు పండుగలా సాగింది. కానీ, నేడు ప్రశ్నార్థకంగా మారుతున్నది. పెద్దపల్లి జిల్లాలోని ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు సాగునీరు అందని పరిస్థితి ఉన్నది. డీ-83 కింద మంథని, ముత్తారం మండలాల్లో దాదాపుగా 10 వేలకు పైగా ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే పంటలు మొత్తంగా దెబ్బ తినే పరిస్థితులు ఉన్నాయి. దీంతో రైతులు ఆందోళ న వ్యక్తం చేస్తున్నారు. నెర్రెలు పారుతున్న పొలాలను చూసి కన్నీళ్లు పెడుతున్నారు. పూర్తి స్థాయిలో సాగు నీరందించడంలో ప్రభుత్వం విఫలమైందంటూ ఆరోపిస్తున్నారు. పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**


పంట ఎండిపోవడంతో తలపట్టుకొని పొలంలో కూర్చున్న కాకర్లపల్లి రైతు బూడిద రమేశ్

పెద్దపల్లి, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ద్వారా సాగు నీటిని సరఫరా చేసే డీ-83, డీ-86 కాలువలు పెద్దపల్లి జిల్లా రైతాంగానికి జీవనాధారమైనవి. డీ-86 కాలువ కింద కరీంనగర్, సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, ఎలిగేడ్, జూలపల్లి, పెద్దపల్లి మండలాల్లోని 86 వేల ఎకరాలకు సాగు నీరు అందించాల్సి ఉండగా, ఇప్పటికైతే ఈ ఆయకట్టుకు పెద్దగా ఇబ్బంది లేదు. కానీ, డీ-83 కింద మాత్రం మప్పు ముంచుకొస్తున్నది. డీ-83 కాలువ ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని చొప్పదండి మండలం రేవెళ్లి నుంచి ప్రారంభమై, పెద్దపల్లి జిల్లాలోని ఎలిగేడు, జూలపల్లి, ధర్మారం, పాలకుర్తి, పెద్దపల్లి, అంతర్గాం, రామగుండం, కాల్వ శ్రీరాంపూర్, కమాన్‌పూర్ మండలం గుండారం రిజర్వాయర్ వరకు 42 కిలో మీటర్లు ప్రవహించి, అక్కడి నుంచి రైట్‌సైడ్ బ్రాంచ్ (ఆర్ఎస్‌బీ) కెనాల్‌గా రామగిరి, ముత్తారం, మంథని మండలాల మీదుగా 41 కిలో మీటర్లు ప్రవహించి మంథని మండలం ఖానాపూర్ వరకు చేరుతుంది. సుమారు 202 గ్రామాలకు సాగునీరు సరఫరా చేస్తుంది. ఈ డీ-83 కాలువ కింద సుమారు 65 మైనర్(ఉప) కాలువలు ఉండగా, మొత్తం 1.26 లక్షల ఎకరాలకు సాగునీరు సరఫరా చేయాల్సి ఉన్నది. అయితే, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందే పరిస్థితి లేదు.

### ఎండుతున్న పొలాలు

గతేడాది కేసీఆర్ సర్కారు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని సకాలంలో సమృద్ధిగా విడుదల చేయడంతో ఎలాంటి సమస్య రాలేదు. కానీ, ఈ సారి పరిస్థితి మారింది. డిసెంబర్ నుంచే ఎస్సారెస్పీ నీళ్లు ఇవ్వాల్సి ఉన్నా.. ఈసారి జనవరి 15వ తేదీ నుంచి ఇస్తున్నారు. యాసంగిలో వారబందీ పద్ధతిలో పంటలకు నీరందిస్తామని అధికారులు చెప్పినా.. అమలుకు నోచుకోలేదు. 15 రోజుల క్రితం కాలువ ద్వారా నీటిని విడుదల చేసినా.. అది కూడా గతం కంటే తక్కువగా ఇవ్వడంతో డీ-83 ప్రధాన కాలువ ద్వారా చివరి ఆయకట్టుకు నీరు చేరలేదు.


మంథని మండలం సూరయ్యపల్లి-కాకర్లపల్లి గ్రామాల మధ్య కాలువ నీళ్లు రాక నెర్రెలు వారిన పంట పొలం

ప్రధానంగా మంథని, ముత్తారం మండలాల్లోని ఎస్సారెస్పీ ఆయకట్టుకు 20 రోజులుగా కాలువ నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. దాదాపు 10 వేలకు పైగా ఎకరాల్లో పంటలు పూర్తిగా దెబ్బతినే ముప్పు కనిపిస్తున్నది. మంథని మండలం పుట్టపాక, లక్కేపూర్, గాజులపల్లి, మైదుపల్లి, కాకర్లపల్లి, గద్దలపల్లి, గోపాల్‌పూర్, చిన్నఓదాల, ఎక్లాస్‌పూర్, రామగిరి మండలం లద్నాపూర్, ఆదివారంపేట, రామయ్యపల్లి, ముత్తారం మండలం రామకిష్టాపూర్, సీతంపల్లి, ఖమ్మంపల్లి గ్రామాల పరిధిలో పంట పొలాలు దెబ్బతిన్నాయి. ఎక్కడ చూసినా బీటలు వారి కనిపిస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలను రక్షించుకునేందుకు వాగులు, వంకలు, వ్యవసాయ బావులు, కుంటలకు బోర్లు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. అందుకోసం వేలకు వేలు వెచ్చించి మోటర్లు, పైపులు కొనుగోలు చేస్తున్నారు. స్తోమతలేని రైతులు మాత్రం పొలాలను అలాగే వదిలేస్తున్నారు. కండ్లముందే ఎండుతున్న పంటలను చూసి కన్నీరుమున్నీరవుతున్నారు. ఈసారి పెట్టుబడులు నిండా మునగాల్సిన పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు. సర్కారు ఆదుకొని సాగునీరివ్వాలని వేడుకుంటున్నారు.

### పంట చేతికచ్చే పరిస్థితి లేదు

ఎండిన పొలంలో తలపట్టుకొని కనిపిస్తున్న రైతు మంథని మండలం కాకర్లపల్లికి చెందిన బూడిద రమేశ్. గతేడాది డీ-83 కెనాల్ ద్వారా చివరి ఆయకట్టుకు పుష్కలంగా నీళ్లు రావడంతో ఆరెకరాల భూమి కౌలుకు తీసుకొని బంగారం లాంటి పండించిండు. ఈసారి కూడా నీళ్లు పుష్కలంగా వస్తాయనే ఆశతో మళ్లీ ఆరెకరాల్లో వరి వేసిండు. సాగు కోసం ₹1.50 లక్షలు ఖర్చు పెట్టిండు. కానీ, ఈసారి చివరి ఆయకట్టుకు నీరందే పరిస్థితి లేక ఆగమవుతున్నడు. ఇప్పటికే ఎండిన పొలాన్ని చూసి కన్నీళ్లు పెడుతున్నడు. పంటను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నడు. సమీపంలో ఉన్న జలవనరుల నుంచి నీటిని తరలించేందుకు పైపులు కొన్నడు. అయినా, పంట దక్కుతుందన్న ఆశ లేక ఆందోళన చెందుతున్నడు. కౌలు ఎట్ల కట్టాలె? మిత్తికి తెచ్చినకాడ అసలెట్ల కట్టాలె? నేనెట్ల బతుకాలె.. కుటుంబాన్ని ఎట్ల పోషించాలె? అని రంది పడుతున్నడు. సర్కారుకు సరైన అవగాహన లేకపోవడంతో నష్టపోయే పరిస్థితి వచ్చిందని మండిపడుతున్నడు. సాగునీరిచ్చి పంటలను కాపాడాలని వేడుకుంటున్నడు.

### పంటలెండే రోజులు అస్తయనుకోలె..



ఇన్నేండ్లల్ల ఇట్ల పంట ఎండిపోవుడు మొదటిసారి కావచ్చు. మునుపెన్నడూ ఇట్ల తడి అందక పంట ఎండిపోలె. ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు రామకిష్టాపూర్ మాది. నాకు ఆరెకురాల పొలం ఉన్నది. ఇక్కడ మూడెకరాలు ఎస్సారెస్పీ కాల్వకింద. ఇంకోకాడ మూడెకరాలున్నది. అక్కడ బోరు కింద మంచిగనే పండుతున్నది. కానీ, ఇక్కడనే నీళ్లందక ఎండే పరిస్థితి వచ్చింది. ఎకురాన ఇరువై వేలదాకా పెట్టిన. మూడెకురాల పెట్టుబడి నష్టపోత గావచ్చని భయమైతంది. గిట్లయితే నా పరిస్థితి దారుణమైతది. ఎకురానికి ఇరువై వేల పెట్టుబడి పోతది. వచ్చే ఇరువై అయిదు వేల లాభం పోతది. చేసి చేసి ఇట్ల నష్టపోవుడంటే చానా బాధైతంది.

**- ఉప్ప శ్రీనివాస్, రైతు, రామకిష్టాపూర్, ముత్తారం మండలం**

## క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- కరీంనగర్ ఏసీపీ ప్రతాప్



పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న ఏసీపీ ప్రతాప్

కొత్తపల్లి, ఫిబ్రవరి 25: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కరీంనగర్ ఏసీపీ ప్రతాప్ క్రీడాకారులకు సూచించారు. తాను ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి క్రీడలే ప్రధాన కారణమని గుర్తు చేసుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న రెవెన్యూ గార్డెన్స్‌లో ఇంటర్నేషనల్ షావోలిన్ కుంగ్ ఫూ బ్రూస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి తెలంగాణ తొలి కుంగ్ ఫూ, కరాటే పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. మార్షల్ ఆర్ట్స్ లాంటి యుద్ధ క్రీడను ప్రతి ఒక్కరూ నేర్చుకుంటే ఆత్మ స్థయిర్యం, విశ్వాసం పెరుగుతుందని వివరించారు. ఇటీవలి కాలంలో కరీంనగర్‌లో క్రీడాపోటీలను బ్రహ్మాండంగా నిర్వహిస్తున్నారని పేర్కొంటూ, నిర్వాహకులను అభినందించారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో మార్షల్ ఆర్ట్స్‌కు కంచుకోట కరీంనగర్ అని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు ఎందరో ఉన్నారన్నారు. అనంతరం పలు విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బంగారు, రజత, కాంస్య పతకాలను ఏసీపీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ, తదితర అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. పలువురు విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, కరాటే విన్యాసాలు అలరించాయి. ఇక్కడ వాగ్దేవి కళాశాల చైర్మన్ గోవిందవరం కృష్ణ, పోటీల నిర్వాహకులు, ఇన్‌స్ట్రక్టర్ ఏ శ్రీనివాస్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్‌రెడ్డి, అత్యాపత్యా క్రీడా సంఘం అధ్యక్షులు చీటి రామారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే సంజీవ్‌రెడ్డి, ప్రొఫెసర్ మల్లారెడ్డి, ఫండస్ స్కూల్ డైరెక్టర్ శశాంక్‌రెడ్డి, కరాటే ఇన్‌స్ట్రక్టర్లు సురభి వేణుగోపాల్, బాబురావు, హరికృష్ణ, విద్యాసాగర్, శేఖర్, మూర్తి, మొయిన్, రవి వర్మ, అన్వర్‌ఖాన్, అఖిల, ఫైమిదా ఖాతూన్ ఉన్నారు.